# సవరాలు

"సవొరాలు కడతా సవొరాలు
మంచి మంచి సవొరాలు
పూల జడలకు సవొరాలు
పూల సికలకు సవొరాలు
కొప్పులకు సవొరాలు"

వీధిలో సవరాలు కట్టే ఆమె రాగయుక్తంగా వేస్తున్న కేక విని తలుపు తీసుకొని బయటకు వచ్చింది.

"ఓ సవరాలమ్మీ, ఇలా రా" అని పిల్చింది. నీలవేణి చక్కటి పొడగాటి సవరమొకటి కట్టించుకోవాలని ఎన్నాళ్ల నుండో అనుకుంటున్నాది. ఆమెకు ఆ కోరిక ఈనాటిది కాదు.

నీలవేణిది జానెడు జడ. వయస్సు వచ్చి మనిషి ఎదిగినా ఆమె జడ పొడవుమాత్రం జానమించలేదు.

చిన్నతనంలో తోటి పిల్లలు పూల జడలు వేసుకొని వచ్చినా , మొగలి పువ్వుల రేకులతో జడకుట్టుకొని వచ్చినా తనకూ అట్లాంటి జడవేయమని మారం చేసి తల్లిచేత చీవాట్లు తినేది నీలవేణి.

అతివల అందాలను ఇనుమడింపచేసేది వారి శిరోజాలంకరణే.

నీలవేణి పెళ్లిలో ఆమెకు పెద్ద సవరంతో పూలజడ వేశారు.

పెళ్లికి వచ్చిన వారందరూ పెళ్లి కూతురు జడను మెచ్చుకున్నారు.

తల దువ్వుకొన్నప్పుడు వచ్చిన చిక్కునంతా పారేయక జాగ్రత్త చేసింది నీలవేణి- దానితో సవరాలు కట్టే వారిచేత సవరం కట్టించుకోవాలని.

నీలవేణి కేక విని సవరాలు కట్టే ఆమె, ఆమె కూతురు వచ్చారు. సవరాలు కట్టే ఆమె పేరు

దేవమ్మ. సుమారు నలభై యేళ్లుంటాయి. మనిషి ముఖంలో కళ ఉంది. మెడ వరకూ కత్తిరించిన గిరజాల జుట్టు. ఆమె కూతురికి పన్నెండేళ్లుంటాయి. పేరు మల్లి, ఆహార లోపం వల్ల మనిషి నీరసించి ఉన్నా మల్లికి అరచేతి వెడల్పు, పిడికెడు మందంతో బారెడు జడ ఉంది. జడ ఆ పిల్ల మోకాళ్లను తాకుతూంది.

"నీ కూతురేనా? జడ పొడవుగా ఒత్తుగా బావుంది!" అంది నీలవేణి మెచ్చుకోలుగా.

"అవునమ్మ గోరూ! మాకు కూడు నేపోయినా ఆటికేం కొదవనేదండి. పూరవొంమావూ బాగా బతికినోల్లవేనండి. దీని అయ్య కాలం సేసి నాక బాగోర్లు మా కన్నేయం సేసీసి నోరండి. కూడు నేక మా సేత నయిన ఇద్దెతో ఇలా ఈదిన పడ్డావండి" అంది దేవమ్మ.

నీలవేణి లోనికి వెళ్లి తను కూడబెట్టిన చిక్కుముద్ద తెచ్చి దేవమ్మ కిచ్చింది.

దేవమ్మ చిక్కు ముద్దను అరచేతిలో ఉంచి దాని బరువు అంచనా వేసి చిక్కులో నుంచి అక్కడక్కడవి కొన్ని వెంట్రుకలు వేరుచేసి తీసి వాటి పొడవు చూసింది. ఏ వెంట్రుకా జానెడు పొడవు మించి లేదు.

"అమ్మగోరూ ఇయన్నీ కురసెంట్రుకల సిక్కండి. మాఁవు కవుకులు వొడిసిక్కు ఇడదీసి సాపు సేసి సవొరం కట్టడానికి రెండు మూడు గంటలవుద్దండి. తీరా సేత్తే మూడు బెత్తెలు నిడివి, సిటికినేలు మందం సవొరం అవుద్దండి. తవరు వోలు జడేసుకోనుకురసండి. సికసుట్టుకోను సాల్దండి".

"తవరి మొగానికి బారెడు వోలు జడేసుగున్నానేదా సక్కగ సికసుట్టుకొని కొప్పుసుట్టూ పూలెట్టుకుంటే సూసి నొల్లదిస్టి దగిలేలా గుంతారండి! సవొరం ఎట్టానేదన్నా మూరెడు నిడివి, పిడికెడు మందం ఉండాలండి. అట్టాంటిది మా సరుకున సేసీడానికి అరవొందవుద్దండి. నేదా మీ సిక్కుత ఎలాగొస్తే అది సేసీడానికి ముప్పయ్యండి. ఏటిగావోల సెప్పండి" అంది దేవమ్మ.

తీసుకుంటున్నప్పుడు పెద్ద సవరమే తీసుకోవడం మంచిది అనుకొని నీలవేణి వాళ్ళతో బేరమాడి 45 రూపాయలకు వాళ్ల మెటీరియల్‌తో చేసి ఇమ్మంది.

"అమ్మగోరూ ఈవలేస్తుంది కూసింత దప్పికియ్యండి" అంది మల్లి.

నీలవేణి లోనికి వెళ్లిచెంబుతో నీళ్లు తెచ్చింది. మల్లి చిన్నగా ఏడుస్తోంది. వాళ్లమ్మ ఊరుకోమని కసురుతోంది.

"ఎందుకేడుస్తోంది?" అని అడగబోయి మల్లివేపు చూసి విస్తుబోయింది నీలవేణి.

మల్లి జడ మెడవరకూ కత్తిరించబడి ఉంది.

కత్తిరించిన జడను దేవమ్మ పాయలుగా చేసి సిల్కు దారంతో చకచకగా సవరం కడుతోంది.

"కూడు నేక పోయినా సోకులు గావాల బొట్టికి" అని కూతురు తల మీద మొట్టింది.

ఇదిగో నమ్మగోరూ సవొరం! సీకాయపొడుం నీల్లు ఇస్తే గుంజీసి ఇస్తాను" అంది దేవమ్మ.

నీలవేణి షాంపూతో సవరాన్ని శుభ్రం చేయించింది

సవరం నీలవేణికి ఎంతగానో నచ్చింది. కాని మల్లిని చూసి జాలి పడింది.

మల్లి మంచినీళ్లు తాగింది.

నీలవేణి 50 రూపాయల కాగితం తెచ్చి దేవమ్మ కిచ్చింది. దేవమ్మ 5 రూపాయలు తిరిగిచ్చింది. నీలవేణి ఆ 5 రూపాయలు, మల్లిచేతులో పెట్టి ఏవైనా కొనుక్కోమంది. మల్లి ముఖం సంతోషంతో వికసించింది.

"అమ్మగోరూ ఈ సిక్కు ముద్ద నాకిప్పించిండి" అంది మల్లి.

"తీసుకో అదింక నా కవసరం లేదు" అంది నీలవేణి.

నీలవేణి ఆ సాయంత్రం కొత్త సవరంతో సిగచుట్టుకొని పక్కింటావిడతో వెంకటేశ్వరస్వామి ఆలయానికి బయల్దేరింది.

దారిలో "సవొరాలు కడతాం" అంటూ తమ ముందు నడుస్తున్న దేవమ్మను, మల్లిని చూసింది.

నిగనిగలాడుతూ జర్రిపోతులా మోకాళ్ల వరకూ వేలాడుతున్న మల్లి జడను చూసి వాళ్ల ఆడిన నాటకానికి నిర్ఘాంతపోయింది నీలవేణి.

(ఆంధ్రప్రభ వారపత్రిక, 26-6-1996) ✪